# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

# విశాఖపట్నం కేంద్రం

# ప్రాంతీయ వార్తలు

తేదీ: 06-07-2025 సమయం : సాయంకాలం 6 గం. 10 ని. లు

## ముఖ్యాంశాలు

- ❖ రాష్ట్రంలో రైతులందరికీ సాగునీరు అందించేందుకు ప్రభుత్వం కృత నిశ్చయంతో ఉందని మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డి అన్నారు.
- ❖ తోటపల్లి ప్రాజెక్టు ద్వారా 85 వేల ఎకరాలకు సాగు నీరు అందిస్తున్నామని గిరిజన సంక్షేమ శాఖ మంత్రి గుమ్మిడి సంధ్యారాణి పేర్కొన్నారు.
- ❖ ప్రయాణికుల రద్దీ దృష్ట్యా 48 ప్రత్యేక రైళ్లను పలు ప్రాంతాలకు నడుపుతున్నామని దక్షిణ మధ్య రైల్వే ఈ రోజు ఒక ప్రకటనలో తెలిపింది.
- ❖ భారత్, ఇంగ్లాండ్ జట్ల మధ్య జరుగుతున్న రెండవ టెస్ట్ మ్యాచ్ లో విజయం సాధించేందుకు భారత్ ఇంకా 5 వికెట్లు తీయాల్సి ఉంది.

==========================

రాష్ట్రంలో రైతులందరికీ సాగునీరు అందించేందుకు ప్రభుత్వం కృత నిశ్చయంతో ఉందని రోడ్లు, భవనాల శాఖ మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డి అన్నారు. ఈ రోజు మంత్రి నంద్యాల జిల్లా నందికొట్కూరు పోతిరెడ్డిపాడు ప్రాజెక్టు నుండి రాయలసీమకు కృష్ణా జలాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడతూ... ఎగువన వర్షాలు కురుస్తున్న కారణంగా 673 క్యూసెక్కుల జలాలు వచ్చి చేరుతున్నాయని తెలిపారు. దాంతో రైతులకు సాగు అందించేదుకు తెలుగుగంగ, గాలేరు - నగరి సుజల స్రవంతి, హంద్రీ - నీవా సుజల స్రవంతి, ఎస్ఆర్బీసీ కాలువలకు నీటిని విడుదల చేశామని పేర్కొన్నారు. అలగనూరు బండ, గోరుకల్లు రిజర్వాయర్ మరమ్మతులను కూడా త్వరలోనే పూర్తి చేస్తామని మంత్రి తెలియజేస్తూ...

(వాయిస్ 26 సెకన్లు)

==========================

తోటపల్లి రైతుల త్యాగం కారణంగా.. సర్దార్ గౌతు లచ్చన్న తోటపల్లి ప్రాజెక్టు మూడు జిల్లాలకు ఉపయోగపడుతుందని గిరిజన సంక్షేమ శాఖ మంత్రి గుమ్మిడి సంధ్యారాణి అన్నారు. ఖరీఫ్ సీజన్ కు ఈ రోజు తోటపల్లి జలాశయం నుండి

నూతన కుడి ప్రధాన కాల్వ ద్వారా నీటిని ప్రభుత్వ విప్, కురుపాం శాసన సభ్యురాలు తోయక జగదీశ్వరితో కలిసి మంత్రి విడుదల చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడతూ... ఈ ప్రాజెక్ట్ ద్వారా పార్వతీపురం మన్యం, విజయనగరం, శ్రీకాకుళం జిల్లాల్లో దాదాపుగా 85 వేల ఎకరాల భూములకు సాగు నీరు అందుతుందన్నారు. జంఝువతి ప్రాజెక్టు, కోటియా సమస్యలపై ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఒడిశా ముఖ్యమంత్రితో మాట్లాడటానికి సిద్ధంగా ఉన్నారని తెలిపారు. పూర్ణపాడు-లాబేసు వంతెన త్వరలోనే పూర్తవుతుందని మంత్రి తెలియజేస్తూ...

(వాయిస్ 32 సెకన్లు)

===========================

ప్రయాణికుల రద్దీ దృష్ట్యా 48 ప్రత్యేక రైళ్లను పలు ప్రాంతాలకు నడుపుతున్నామని దక్షిణ మధ్య రైల్వే ఈ రోజు ఒక ప్రకటనలో తెలిపింది. ఈనెల 9 నుంచి సెప్టెంబరు 25వ తేదీ వరకు వివిధ రోజుల్లో ప్రత్యేక రైళ్లు అందుబాటులో ఉంటాయని పేర్కొంది. కాచిగూడ-తిరుపతి మధ్య ప్రతి గురు, శుక్ర వారాల్లో 8 ప్రత్యేక రైళ్లు, తిరుపతి- హిసార్ మధ్య బుధ, ఆదివారాల్లో 12 ప్రత్యేక రైళ్లు నడువనున్నాయని తెలిపింది. నరసాపూర్- తిరువణ్ణమలైకి బుధ, గురు వారాల్లో 16 రైళ్లు రాకపోకలు సాగించనున్నాయి. రైళ్ల రాకపోకల వివరాలను దక్షిణ మధ్య రైల్వే వెబ్ సైట్‌లో పొందుపరచామని, ఈ రైళ్లలో ముందస్తు రిజర్వేషన్ సదుపాయం కల్పించామని అధికారులు వెల్లడించారు.

===========================

తొలి ఏకాదశి పర్వదినం సందర్భంగా ఈరోజు రాష్ట్రంలో ప్రముఖ వైష్ణవ దేవాలయాలు భక్తులతో ఆధ్యాత్మిక శోభ సంతరించుకుంది. ఉభయ గోదావరి జిల్లాల్లోని ప్రసిద్ధ ఆలయాలు భక్తులతో రద్దీగా మారాయి. తెల్లవారుజాము నుంచే భక్తులు స్వామివారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. ఇంద్రకీలాద్రికి కూడా భక్తులు పెద్ద సంఖ్య వచ్చారు. రద్దీ దృష్ట్యా అంతరాలయ దర్శనాలకు అనుమతిపై అధికారులు నియంత్రణ విధించారు. తొలి ఏకాదశి పర్వదినం సందర్భంగా తెలుగు ప్రజలందరికి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, మంత్రి నారా లోకేశ్ శుభాకాంక్షలు తెలిపారు.

విరామం

===========================

మొహర్రం సందర్భంగా నెల్లూరు నగరంలోని బారాషహీద్ దర్గా వద్ద రొట్టెల పండుగ ఘనంగా ప్రారంభమైంది. తెల్లవారుజామున నుంచి భక్తులు.. బారాషాహిద్ దర్గాను సందర్శించుకుని స్వర్ణాల చెరువులో రొట్టెలు పట్టుకుంటున్నారు. కోరికల రొట్టెల కోసం దేశ, విదేశాల నుంచి భక్తులు చేరుకుంటున్నారు. రాష్ట్ర ప్రభుత్వం భక్తుల కోసం టెంట్లు, తాగునీరు, ఉచిత భోజన ఏర్పాట్లు చేసింది. ఐదు రోజుల పాటు బారాషహీద్ దర్గాలో రొట్టెల పండుగ జరగనుంది. జిల్లా కలెక్టర్, ఎస్పీ, ఇతర ఉన్నతాధికారులు  ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారు.

===========================

జంతువుల నుంచి మనుషులకు సంక్రమించే వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని శ్రీకాకుళం జిల్లా పశుసంవర్ధక శాఖ జాయింట్ డైరెక్టర్ డాక్టర్ కంచరాన రాజగోపాలరావు  సూచించారు. “ప్రపంచ జునోసిస్ దినోత్సవం” సందర్భంగా ఈ రోజు పశుసంవర్ధక శాఖ కార్యాలయం వద్ద కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... జంతువుల నుంచి సంక్రమించే వ్యాధులలో రేబిస్ వ్యాధి ప్రమాదకరమైనదని, కుక్కలు పెంచే వారు చాలా జాగ్రత్తలు వహించాలని కోరారు. కృష్ణ జిల్లా పశుసంవర్ధక శాఖ కార్యాలయంలో పశుసంవర్ధక శాఖ జాయింట్ డైరెక్టర్ చిన్న నరసింహులు ఆధ్వర్యంలో కుక్కలకు ఉచితంగా యాంటీ రాబిస్ టీకాలను వేసే కార్యక్రమాన్ని నిర్వహించారు. పశువులకు, పక్షులకు వ్యాధులు రాకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని ఆయన తెలియజేస్తూ...

(వాయిస్ 26 సెకన్లు)

==========================

ప్రభుత్వ బడుల్లో తమ పిల్లలను చదివిస్తున్న ఉపాధ్యాయులకు విద్యా శాఖా మంత్రి నారా లోకేశ్ సామాజిక మాధ్యమం ఎక్స్ వేదికగా అభినందనలు తెలిపారు. పశ్చిమ గోదావరి జిల్లాకు చెందిన ముగ్గురు ఉపాధ్యాయులు మధుబాబు, రాజేంద్రప్రసాద్, కరుణాకర్‌రావును అభినందించారు. ప్రభుత్వ విద్యకు రాయబారులుగా వారిని అభివర్ణించారు. ప్రైవేటు విద్యా సంస్థల కంటే మెరుగైన ఫలితాలు సాధించేలా కృషి చేద్దామని తెలిపారు.

==========================

పశ్చిమ గోదావరి జిల్లా వ్యాప్తంగా ఈనెల 10న అన్ని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, జూనియర్ కళాశాలలో "మెగా పేరెంట్స్ టీచర్స్ మీట్" పండుగలా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి సూచించారు. మెగా పేరెంట్స్ టీచర్స్ మీట్ కార్యక్రమ నిర్వహణ ఏర్పాట్లపై ఈ రోజు దృశ్య శ్రవణ మాధ్యమం ద్వారా జిల్లా కలెక్టర్ అధికారులతో సమీక్ష చేశారు. ప్రజాప్రతినిదులను, పూర్వ విద్యార్దులను ఆహ్వానించి భాగస్వామ్యం చేయాలని, విద్యార్థులందరూ తప్పనిసరిగా కొత్త స్కూల్ యూనిఫామ్ ధరించి విధిగా హాజరయ్యేలా చూడాలని తెలిపారు.

==========================

అండర్సన్ టెండూల్కర్ ట్రోఫీలో భాగంగా ఇంగ్లాండ్ బర్మింగ్‌హామ్‌లోని ఎడ్జ్ బాస్టన్ వేదికగా భారత్, ఇంగ్లాండ్ జట్ల మధ్య జరుగుతున్న రెండవ టెస్ట్ మ్యాచ్ 5వ రోజు ఆట వర్షం కారణంగా ఆలస్యంగా ప్రారంభమైంది. 72 పరుగుల ఓవర్ నైట్ స్కోర్ తో ఆటను ప్రారంభించిన ఇంగ్లాండ్ జట్టు కొద్ది సేపటికే 2 వికెట్లు కోల్పోయింది. దీంతో భారత్ విజయానికి మరో ఐదు వికెట్లు తీయాల్సి ఉంది. ప్రస్తుతం 5 వికెట్లు కోల్పోయి 100 పరుగులు చేసిన ఇంగ్లాండ్ ఈ మ్యాచ్ ను డ్రా చేసుకునేందుకు పోరాడుతోంది.

==========================

ఆంధ్రప్రదేశ్ మీదుగా దిగువ ట్రోపో ఆవరణంలో పశ్చిమ గాలులు వీస్తున్న కారణంగా రాగల మూడు రోజుల పాటు ఉత్తర కోస్తా ఆంధ్రప్రదేశ్ లో తేలికపాటి నుండి ఒక మోస్తరు వర్షాలు లేదా ఉరుములతో కూడిన జల్లులు కొన్ని చోట్ల కురిసే అవకాశముందని అమరావతి వాతావరణ కేంద్రం తెలిపింది. ఉరుములతో కూడిన మెరుపులు బలమైన గాలులు గంటకు 40 నుండి 50 కిలోమీటర్ల వేగంతో వీచే అవకాశం ఉందని పేర్కొంది.

==========================
==========================